విలేకరులు కావలెను
మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను
Cell:9247819181, 8309605189

TITLE Code TEL TEL12230
మన వార్త
ప్రజాగళానికి అక్షర రూపం
MANA VAARTHA



హైదరాబాద్,కరీంనగర్,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల | ఆదివారం 23 జూన్ 2024 | పేజీలు : 4 వెల : రూ.2

## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఇంటికి సీఎం రేవంత్ రెడ్డి..



**మన వార్త** చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ ఎమ్మెల్యే సత్యం ఇంటికి వెళ్లారు.ఈ సందర్భంగా రూపాదేవి చిత్రపటానికి పూలమాల వేసి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే సత్యాన్ని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాగా, రెండు రోజుల క్రితం అనారోగ్య సమస్యలతో ఎమ్మెల్యే సత్యం భార్య రూపాదేవి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. బిజీ షెడ్యూల్ వల్ల రూపాదేవి అంత్యక్రియలకు సీఎం రేవంత్ రెడ్డి హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో ఇవాళ ఎమ్మెల్యే సత్యం ఇంటికి వెళ్లి రేవంత్ రెడ్డి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.


# మహిళా శక్తి క్యాంటీన్లు ఒక బ్రాండ్ గా ఎదగాలి...



**మన వార్త** రాష్ట్రంలో మహిళా స్వయం సహాయక సంఘాలు నిర్వహించే మహిళాశక్తి క్యాంటిన్లు ఒక బ్రాండ్‌గా ఎదగాలని, వాటిని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. రాష్ట్రంలో తొలిసారిగా సచివాలయంలో ఏర్పాటు చేసిన మహిళాశక్తి క్యాంటిన్లను సీఎస్ శాంతికుమారితో కలిసి మంత్రి సీతక్క శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న రెండేళ్లలో రాష్ట్రంలో 151 మహిళా శక్తి క్యాంటిన్లను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్దేశించిన లక్ష్యం మేరకు ముందుకు సాగుతామన్నారు.స్థానికంగా లభ్యమయ్యే వనరులు, వస్తువుల ఆధారంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా మహిళాశక్తి బిజినెస్ మోడల్‌ను రూపొందించి.. ఆర్థిక సహకారం లభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అమ్మ చేతి వంటలా మహిళాశక్తి క్యాంటిన్లు నాణ్యతకు మారుపేరుగా నిలవాలని, పల్లె రుచులు, ఇప్పపువ్వు లడ్డూలు, నన్నారి వంటి సంప్రదాయ ఆహార పానీయాలను పట్టణాలకు పరిచయం చేయాలని సూచించారు.




# భారీగా డ్రగ్స్ పట్టివేత



**– డ్రగ్స్‌ను పలు కొత్త దారుల్లో నగరానికి తీసుకొస్తున్న కేటుగాళ్లు**

హైదరాబాద్ **మన వార్త** : పోలీసులు ఎన్ని చర్యలు తీసకుంటున్నా కేటుగాళ్లు మాత్రం డ్రగ్స్‌ను పలు కొత్త దారుల్లో నగరానికి తీసుకొస్తున్నారు. పోలీసుల కళ్లు గప్పి వ్యాపారస్తులకు అంటగడుతున్నారు. తాజాగా.. మాదాపూర్‌లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భారీగా డ్రగ్స్ పట్టుకున్నారు. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కి డ్రగ్స్ తీసుకొస్తున్న సాయి చరణ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డ్రగ్స్‌ని చిన్న చిన్న ప్యాకెట్లలోకి మార్చి ప్రైవేట్ ట్రావెల్స్ డ్రైవర్స్ ద్వారా నిందితుడు సాయి చరణ్ సరఫరా చేస్తున్నాడని పోలీసులు చెప్పారు. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వచ్చే ట్రావెల్స్ బస్సు డ్రైవర్ ద్వారా డ్రగ్స్ రవాణా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నలుగురు డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న వ్యాపారవేత్తలతో పాటు ప్రధాన నిందితుడు సాయిచరణ్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారవేత్తలు మాలిక్ లోకేష్, సందీప్ రెడ్డి,రాహుల్ ,సుబ్రహ్మణ్యంలను నార్కోటిక్ బ్యూరో అధికారులు అరెస్ట్ చేశారు. గతంలోనూ డ్రగ్స్ కేసులో సాయిచరణ్‌ను డ్రగ్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు పట్టుకున్నారు.. 50 మంది వ్యాపారవేత్తలకు నిందితుడు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్, నెల్లూరు, విజయవాడ రాజమండ్రి, వైజాగ్‌లో ఉన్న వ్యాపారవేత్తలకు డ్రగ్ సరఫరా చేస్తున్నారని అన్నారు. రాజేశ్వరి ట్రావెల్స్ , జీవీఆర్, స్టార్ట్, చెర్రీ ట్రావెల్స్ ద్వారా డ్రగ్స్ రవాణా చేస్తున్నడని పోలీసులు వివరించారు.

# చిన్నమ్మ రీఎంట్రీ వ్యూహం..?



**– ముఖ్యంగా బీజేపీకి కూటమి అవసరం ఉంది**

**– ఆంధ్రలో ఏర్పడ్డ కూటమి తమిళ నాడులోనూ ఏర్పడుతుందా..?**

డెస్క్ మన వార్త : ఏపీ ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి సాధించిన ఘన విజయం తమిళనాడులోనూ అటువంటి కూటమి ఆవశ్యకతను తెలియజేస్తోంది. ముఖ్యంగా బీజేపీకి ఆ అవసరం ఉంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఆంధ్రలో ఏర్పడ్డ కూటమి వంటిది తమిళ నాడులోనూ ఏర్పడాలి. ఈ ప్రశ్నలకు సమాధానం రానున్న రోజుల్లో తెలియనున్నాయి. తమిళనాడులో స్వర్గీయ జయలలిత ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడూ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడూ ఆమె నీడలా మెలుగుతూ శశికళ రాష్ట్రంలో పాలన పరంగానూ, పార్టీ పరంగానూ చక్రం తిప్పేవారు. అది అప్పట్లో పలు వివాదాలకు కూడా కారణం అయింది. ఎంజీ రామచంద్రన్ మరణానంతరం పార్టీ తిరస్కారానికి, అవమానాలకు గురై ఒంటరి ఐన జయలలిత తన మేధ, తన తీరుతో పుంజుకుంటూ కరుణానిధికి పోటీగా రాటుదేలుతున్న సమయంలో శశికళ, ఆమె బంధువర్గం జయలలితకు తోడూ నీడ అయ్యారు.శశికళ జైలుకు వెళ్లాక పళనిస్వామి పార్టీపై తన పట్టు బిగించి పార్టీని సొంతం చేసుకున్నారు. ఆ క్రమంలో శశికళను పూర్తిగా పార్టీకి దూరం చేశారు. అందువల్ల శిక్షాకాలం ముగించుకుని వచ్చిన శశికళ రాజకీయాలకు, పార్టీకి దూరంగానే ఉండాల్సి వచ్చింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో పళనిస్వామి అధ్యక్షతన ఏఐఏడీఎమ్‌కె పార్టీ ఓడిపోయి డీఎమ్‌కే పార్టీ అధినేత స్టాలిన్ ముఖ్యమంత్రి అయ్యారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లోనూ ఈ పార్టీ ఓటమినే చవి చూసింది. పళనిస్వామి పార్టీలోనూ, ప్రజా క్షేత్రంలోనూ బలహీనుడవుతున్నారు.లోక్‌సభ ఎన్నికలయ్యాక, శశికళ ఏఐఏడీఎమ్‌కె పార్టీ శ్రేణులతో సమావేశమవడం, తదుపరి కార్యాచరణకు సిద్ధమవడం తమిళనాడులో చర్చోపచర్చలు మూలం, మూలకం అవుతోంది. తమిళనాడులో ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓటు శాతాన్ని పెంచుకోగలిగినా ఏ ఒక్క స్థానాన్ని సాధించలేకపోయింది. ఈ ఎన్నికల్లో ఏఐఏడీఎమ్‌కె పార్టీతో పొత్తు పెట్టుకునే విషయంలో బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు అన్నామలై సుముఖంగా లేనందువల్ల పొత్తు కుదరలేదు. అందుకు కారణం పళనిస్వామి, మరి కొందరు పార్టీ పెద్దల ప్రవర్తన అని బహిరంగంగానే చెబుతున్నారు. బీజేపీ, ఏఐఏడీఎమ్‌కే మధ్య పొత్తు కుదిరి ఉంటే ఇరు పార్టీలకూ ఎన్నికల్లో ఇప్పటికన్నా మెరుగైన ఫలితాలు వచ్చి ఉండేవన్నది నిర్వివాదం. ప్రస్తుతం ఎడప్పాడి పళనిస్వామి నాయకత్వం పార్టీకి పనికిరానిదిగా మారిందన్నది కొందరి ఆలోచన.

## విశ్వవిద్యకు పూర్వవైభవం దక్కేనా..!



**మన వార్త** ‘విశ్వవిద్యాలయాలు’ మానవత్వానికి, సహనానికి, తర్కానికి, సాహసోపేత ఆలోచనలకు, సత్యశోధనాల కోసం నిలబడాలని ఆనాడు దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఆకాంక్షించినట్టే.. సమాజ ప్రగతి జరగాలన్నా ఆ ప్రాంతంలో ‘విశ్వవిద్యాలయం’ అందుబాటులో ఉండటం అత్యంత కీలకం. ఉస్మానియా, కాకతీయతో పాటు అప్పటికే ఉన్న 15 విశ్వవిద్యాలయాల నిర్వహణకు, సంక్షేమానికి నిధులు కేటాయించలేదు. పైపెచ్చు ఇన్చార్జిల రెండేళ్ల పాలన కారణంగా నాణ్యతా ప్రమాణాలు పూర్తిగా పడిపోయాయి. అనంతరం కొత్తగా వీసీలను నియమించినా.. పనితీరులో నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలు, నిధుల లేమి.. వెరసి పూర్వవైభవం కోల్పోయే దుస్థితికి దిగజారాయి. ఫలితంగా కేంద్ర ఉన్నత విద్యాశాఖ విడుదల చేసిన నేషనల్ ఇన్స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ ర్యాంకుల్లో మన ప్రాంత విశ్వవిద్యాలయ ర్యాంకులు పడిపోయాయి. శాతవాహన, తెలంగాణ వంటి కొన్ని కొత్త యూనివర్సిటీలు ఏర్పడి 16 సంవత్సరాలు పూర్తవుతున్నా వాటిలో కొత్త కోర్సులు అందుబాటులోకి రాలేదు. ఇంజినీరింగ్, లా, బీఎడ్ వంటి అనుబంధ కళాశాలలను ఏర్పాటు చేయలేదు. బ్లాక్ గ్రాంట్ నిలుపుదల కారణంగా సిబ్బంది జీతభత్యాలకు వెంపర్లాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పరిశోధనలకు బాటలు వేసే ప్రయోగశాలలు అగమ్యగోచరంగా మారాయి. గ్రంథాలయాలు అస్తవ్యస్తమయ్యాయి. మౌలిక వసతుల కల్పన ఊసే లేకుండా పోయింది. మొత్తంగా విశ్వ విద్య తిరోగమనంలో పడిపోయింది.రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో 80 శాతం ప్రొఫెసర్ల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని గణాంకాలు చెబుతున్నాయి. యూజీసీ నిబంధనల ప్రకారం ప్రతీ డిపార్ట్‌మెంట్‌లో నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, ఒక ప్రొఫెసర్ పోస్టు తప్పకుండా ఉండాలి. కానీ, ఇప్పటికీ వేల సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫలితంగా పోటీ పరీక్షల్లో కష్టపడి ర్యాంకులు సాధించి ప్రవేశాలు పొందిన విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందకుండా పోయింది.

# జోరుగా వ్యవసాయం చేస్తున్న కేసీఆర్



**– ఈ పదేళ్లు ఆయనకు వ్యవసాయంపై పూర్తి సమయం దృష్టిపెట్టే అవకాశం దొరకలేదు...**

**– ఇప్పుడు ప్రతిపక్ష నేతగా ఆయనకున్న తీరిక సమయాన్ని వ్యవసాయంపై గడుపుతున్నారు...**

మన వార్త మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉన్న ఆయన ఎప్పుడు వ్యవసాయం చేయడం మాత్రం ఆపలేదు. ఒకవైపు ఉధృతంగా ఉద్యమం చేస్తూనే అంతే ఉత్సాహంగా వ్యవసాయం కూడా చేసేవారు. ఉద్యమ కాలంలో కూడా సమయం దొరికిన ప్రతిసారి ఫామ్ హౌస్‌కి వెళ్లి అగ్రికల్చర్ పనులను పర్యవేక్షించేవారు. అంతెందుకు ఉద్యమ ప్రణాళికలకు ఒక సమయంలో కేంద్ర బిందువు కేసీఆర్ ఫామ్ హౌస్ అయింది. అప్పట్లో కొత్త వంగడంగా ఆలుగడ్డలు పండించి రైతులను కూడా ఆ కొత్త పద్ధతుల్లో వ్యవసాయం చేయాలని ప్రోత్సహించారు. ఆ తర్వాత అదో వివాదంగా మారింది.ఇక 10 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న టైంలో కూడా ఎప్పుడు సమయం దొరికినా ఫామ్ హౌస్‌కి వెళ్లేవారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. అయితే ఈ పదేళ్లు ఆయనకు వ్యవసాయంపై పూర్తి సమయం దృష్టిపెట్టే అవకాశం దొరకలేదు. పూర్తిగా ఆర్గానిక్ పద్ధతిలో పండిస్తూ వ్యవసాయం చేస్తున్నారు. గ్లూకోస్ కంటెంట్ చాలా తక్కువగా ఉండే షుగర్ ఫ్రీ రైస్‌ని ఇప్పుడు కేసీఆర్ వండిస్తున్నట్లుగా సమాచారం. వీటితోపాటు రకరకాల పండ్ల మొక్కలు, అన్ని సీజన్లలో దొరికే ఫ్రూట్స్ ఆర్గానిక్ కూరగాయలు ప్రత్యేకంగా దగ్గరుండి చూసుకుంటున్నారు కేసీఆర్. ఆయన కేంద్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉన్నా ఎప్పుడు ఫామ్ హౌస్‌కి మాత్రం దూరం కాలేదు. వ్యవసాయంపై అంత మక్కువ కేసీఆర్ కు.. ఇప్పుడు దొరుకుతున్న వెసులుబాటును ఆయన పూర్తిస్థాయిలో తనకు ఇష్టమైన వ్యవసాయంపై గడుపుతున్నారు. ఫామ్ హౌజ్ మొత్తం ఇటీవల సాయిల్ టెస్ట్ చేయించారు కేసీఆర్. ఎక్కడ సారవంతమైన భూమి ఉంది.. ఎలాంటి భూమిలో ఏ పంటలు వేయచ్చు అనే దానిపై అక్కడున్న పనివాళ్లకు ఒక అవగాహన కల్పించారట. వర్షాలు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నడంతో.. తెలికపాటి వర్షాల్లో కూడా కమర్షియల్ క్రాప్స్ ఎలా పండించాలి అనే అంశంపై కేసీఆర్ దృష్టి పెట్టినట్లు తెలుస్తుంది.

## ఒకటి కాదు.. రెండుకాదు..
# ఏకంగా 32 నాగు పాము పిల్లలు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 22 (మన వార్తా ప్రతినిధి పాల్గుణ)**
భద్రాద్రి కొత్తగూడెంలోని నెహ్రూ బస్తీకి చెందిన కరెంటు ఎలక్ట్రిషన్ రాజు అనే వ్యక్తి ఇంటి గోడకు ఉన్న రంధ్రంలో పాము పిల్లలు కనిపించడంతో రాజు స్నేక్ క్యాచర్ టీమ్ కు సమాచారం అందించాడు. స్నేక్ క్యాచర్ దత్తు బృందం కొన్ని గంటల పాటు శ్రమించి పెద్ద పాము తో పాటు మొత్తం 32 నాగు పాము పిల్లలను, పట్టుకుని ప్లాస్టిక్ డబ్బాలో బంధించారు.

# రైతులందరికీ ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు



**–రైతు సంఘం నాయకులు ఉడుగుల శ్రీకాంత్**

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 22 (మనవార్త ప్రతినిధి పాల్గున)**
సుజాతనగర్ మండలం వేపలగడ్డ గ్రామం రైతు సంఘం నాయకులు ఉడుగుల శ్రీకాంత్ మాట్లాడుతూ విస్తీర్ణమైన వర్షాలతో నదులన్నీ నిండి పంట భూములు సిరుల పంటలు పండాలని రైతన్నల ఇంట పండగ వాతావరణం వెల్లివిరవాలని ఆంక్షించారు రైతులందరికీ ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు

## రైతు రుణమాఫీతో సంబరాలు రైతులకు స్వీట్లు తినిపించిన ప్రభుత్వ విప్..



**వేములవాడ, జూన్ 22 (మన వార్త ప్రతినిధి నందు రావు):**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,మంత్రివర్గం నిన్నటి రోజు ప్రకటించిన ఏకకాలంలో రైతులకు 2 లక్షల రుణమాఫీ పై హర్షం వ్యక్తం చేస్తూ కథలపూర్ మండలం తంద్రియాల గ్రామంలో రైతులతో కలసి ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ మిఠాయిలు పంపిణీ చేస్తూ సంబరాలు జరుపుకున్నారు.

## బండి సంజయ్ నీ కలిసి శుభాకాంక్షలు తెలిపిన బిజెపి నాయకులు



**చందుర్తి మండల్, జూన్ 22 (మన వార్త ప్రతినిధి ముఖేష్):**
చందుర్తి మండలం ఎన్నిగల్ గ్రామ బిజెపి నాయకులు శనివారం రోజున కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ నీ కరీంనగర్ లోని తన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంటు సభ్యుడిగా రెండోసారి విజయం సాధించి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్ కుమార్ నీ కలిసి శుభాకాంక్షలు తెలుపడం జరిగిందన్నారు ఇట్టి కార్యక్రమంలో బిజెపి నాయకులు ,మోకిలే విజేందర్,కూసుంబ లింగారావ్,చేపూరి రాజు, చేవూరి సాయి తదితరులు పాల్గొన్నారు.

# మొలంగూర్ చెరువులో వింత చేప లభ్యం



**శంకరపట్నం,జూన్ 22(మన వార్త ప్రతినిధి నేరెళ్ల సంతోష్)**
కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో జాలరి వలలో అరుదైన నక్షత్ర గుర్తులున్న చేప చిక్కింది. గ్రామంలోని దామెర చెరువులో శుక్రవారం పూదరి ఎల్లయ్య అనే మత్స్యకారుడు వల వేశాడు.విచిత్ర ఆకారంలో ఉన్న ఈచేప వలలో పడింది. శరీరంపై నక్షత్రాల చిన్నచిన్న గుర్తులు ఉన్నాయి.ఇది ప్రమాదకర చేప దీనిని సక్కర్ ఫిష్, దెయ్యం చేప అని కూడా పిలుస్తుంటారు.ఈ చేప విమాన ఆకారాన్ని పోలి ఉంటుంది.ఈ చేపను ఎవరూ తినరని ముదిరాజ్ కులస్తులు తెలిపారు.ఈ చెరువులో ఈ చేప లభ్యం అవడం ఇది రెండోసారి అని మత్స్యకారులు తెలిపారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



**–సూరి కృష్ణ సీనియర్ సివిల్ జడ్జి**

జహీరాబాద్, జూన్ 22(మన వార్త ప్రతినిధి): మండల లీగల్ సర్వీసెస్ కమిటీ జహీరాబాద్ ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల నిషేధంపై నిర్వహించిన అవగాహన సదస్సు కు సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ సూరి కృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు సాధారణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. నిషేధిత మాదక ద్రవ్యాలపై కనీస అవగాహన ఉండాలని, మన నిత్య జీవితంలో మతి స్థిమితం లేకుండా కనిపించే వారిలో మాదక ద్రవ్యాలకు అలవాటు పడ్డవారు ఉంటారన్నారు. డ్రగ్స్ రాకెట్ విభిన్న కోణాల్లో యువతను మత్తుకు అలవాటు పడేలా పక్కదారి పట్టిస్తుందని, విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలాన్నారు. స్కూల్, కాలేజీ పరిసరాప్రాంతాల్లో, అపరిచిత వ్యక్తులు ఇచ్చిన తిను బండరాలను తీసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాల అమ్మకం, వినియోగంపై మీకు తెలిస్తే స్థానిక పోలీస్ స్టేషన్ లో, కోర్టు సమూహంలో గల మండల లీగల్ సర్వీసెస్ కార్యాలయంలో తెలియజేయాలన్నారు. మీ వివరాలు గోప్యంగా ఉంచబడుతాయని తెలియ జేసారు. ఈ కార్యక్రమంలో పోక్సో చట్టం, సమాచార హక్కు చట్టం, జువైనెల్ జస్టిస్ యాక్ట్, ఉచిత న్యాయసేవా సహాయంపై విద్యార్థులకు తెలియ జేసారు. ఈ కార్యక్రమంలో బార్ వైస్ ప్రెసిడెంట్ మానెన్న, న్యాయవాదులు శంకర్, రుద్రయ్య స్వామి, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లు, పాఠశాల బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంపీ రఘునందన్ రావును కలిసిన గుడాల శేఖర్ గుప్తా



**గజ్వేల్ జూన్ 22(మన వార్త ప్రతినిధి జీ మురళి)**
మెదక్ ఎంపీ రఘునందన్ రావును హైదారాబాద్ లో శనివారం మర్యాద పూర్వకంగా కలిసిన సారధి ఫౌండేషన్ చైర్మన్ గుడాల శేఖర్ గుప్త ఈ సందర్భంగా గుడాల శేఖర్ గుప్తా మాట్లాడుతూ మెదక్ ఎంపీ గా బారీ మెజారిటీతో విజయం సాధించిన మెదక్ ఎంపీ రఘునందన్ రావును హైదారాబాద్ లో మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలపడం జరిగిందని మెదక్ ప్రజలకు కేంద్రం నుండి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి. ఉమ్మడి మెదక్ ప్రాంతాన్ని అభివృద్ధి కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేయడం జరిగిందని అన్నారు

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**వేములవాడ, జూన్ 22 (మన వార్త ప్రతినిధి నందు రావు):**
వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని తెలంగాణ చౌక్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం. రూ.2 లక్షల వరకు వ్యవసాయ రుణాల మాఫీకి మంత్రివర్గం ఆమోదం. డిసెంబర్ 12, 2018 నుంచి డిసెంబర్ 9, 2023 లోపు తీసుకున్న తీసుకున్నారని అన్నారు. రుణాలకు వర్తింపు. 48 లక్షల మంది రైతులకు రూ.31 వేల కోట్ల రుణమాఫీకి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వారన్నారు.ఆగస్టు 15, 2024లోపు రుణమాఫీ పూర్తిచేసేందుకు కసరత్తు. మే 6, 2022 నాటి వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రుణమాఫీ హామీ ఇచ్చిన నిలబెట్టుకున్నటువంటి గొప్ప వ్యక్తి రేవంత్ రెడ్డి. రైతు బాగు కోరుకునే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని రానున్న రోజుల్లో కూడా కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ వేములవాడ రైతుల పక్షాన ప్రజల పక్షాన ధన్యవాదములు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పట్టణ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, సాగరం వెంకటస్వామి,మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, నాయకులు చిలుక రమేష్ కూరగాయల కొమరయ్య కనికరపు రాకేష్ పులి రాంబాబు గౌడ్ గూడూరి మధు,ముప్పిడి శ్రీనివాస్, వంగల శ్రీనివాస్,నాగుల రాము, పుల్కం రాజు, తోట లహరి, ముప్పిడి శ్రీధర్, వస్తాది కృష్ణ నాగుల మహేష్, కోయినేని బాలయ్య, తోటరాజు బైరి సతీష్, నామాల పోశెట్టి, అరుణ్ తేజ చారి,దాడి మల్లేశం, కొక్కుల రాజు, వరిచే మల్లేశం, కతాడి రాజేశం, అంబాటి చందు, ఎర్ర శ్రావణ్, మండే రాజు సాబీర్, ఇబ్రహీం దూలం భూమేష్,మర్రిపల్లి రాజు,చిట్టి, లత మహదేవుని అంజయ్య,తదితరులు ఉన్నారు.

# ఏజెంట్ల పై జిల్లా పోలీస్ ప్రత్యేక నజర్




**వేములవాడ, జూన్ 22 (మన వార్త ప్రతినిధి నందు రావు):**
ఈ సంవత్సరం జిల్లాలో నకిలి గల్ఫ్ ఏజంట్ల పై 34 కేసులలో 58 మందిపై కేసులు నమోదు.జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ జిలాల్లో నకిలి గల్ఫ్ ఏజెంట్ల మోసలపై పలు ఫిర్యాదులు వస్తున్న నేపధ్యంలో గతంలో తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేయడం జరిగిందని,నకిలీ గల్ఫ్ ఏజెంట్లు తీరు మార్చుకోకపోతూ ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని,గల్ఫ్ ఏజెంట్ల చేతిలో మోసపోయిన వారు నేరుగా పోలీస్ స్టేషన్ లలో పిర్యాదు చేస్తే తక్షణమే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం అని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ మేరకు శనివారం రోజున ఒక ప్రకటన జారీ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.జిల్లా నుండి ఉపాధి కోసం వెళ్ళే వారి వద్ద నుండి అధిక మొత్తంలో డబ్బులు తీసుకొని, నకిలీ వీసాలు ఇచ్చి ,పాస్ పోర్ట్ లు దగ్గర ఉంచుకొని ఇవ్వకుండా మోసాలకు పాల్పడుతున్న నకిలీ ఏజెంట్ల పై జిలాల్లో గత సంవత్సరం 34 కేసులలో 38 మందిని అరెస్ట్ చేసి 09 మందిని జైలుకి తరలించడం జరిగిందని, ఈ సంవత్సరం 34 కేసులలో 58 మందిని అరెస్ట్ చేసి ఇద్దరిని జైలుకు తరలించడం జరిగిందని తెలిపారు.ఉపాధి కోసం గల్ఫ్ వెల్లేవారు నకిలి ఏజెంట్లను ఆశ్రయించి మోసపోవద్దని, గల్ఫ్ దేశాలకు వెళ్ళ వారు లైసెన్స్ కలిగి ఉన్న ఏజెంట్లను మాత్రమే ఆశ్రయించి, వారి ద్వారానే వీసాలు పొందవలసిందిగా సూచించారు. గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు లైసెన్స్ గల ఏజెంట్ల వివరాలు తెలుసుకొనుటకు జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ 8712656411 లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ ని సంప్రదించవచ్చని సూచించారు.

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ను మర్యాదపూర్వకంగా కలిసిన వైయస్సార్ టిపి మాజీ జిల్లా అధ్యక్షుడు



**వేములవాడ, జూన్ 22 (మన వార్త ప్రతినిధి నందు రావు):**
రాజన్న సిరిసిల్ల జిల్లా వైఎస్ఆర్ టీపి మాజీ జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు చొక్కాల రాము శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో నూతన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చొక్కాల రాము కలెక్టర్ ముంపు గ్రామాల సమస్యలను గూర్చి వివరించారు. ముంపు గ్రామాల్లోని చింతల్ టానా, ఆర్ఆర్ కాలనీలో జరుగుతున్న అక్రమ లే అవుట్లను తొలగించాలని, 18 సంవత్సరాలు నిండిన యువతులకు నిరుద్యోగ భృతి కల్పించాలని, ముంపు గ్రామాల ఇంటి నష్టపరిహారం రానివారికి నష్టపరిహారం వెంటనే అందించాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## డాక్టరేట్ పొందిన కానిస్టేబుల్ కు ఘన సన్మానం



**జహీరాబాద్, జూన్22(మన వార్త ప్రతినిధి):**
పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తూ, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల ద్వారా మెరుగైన సమాజం కోసం కృషి చేస్తున్న కానిస్టేబుల్ చిందం సుభాష్ కు గౌరవ డాక్టరేట్ బిరుదు రావడంతో జహీరాబాద్ బీజేపి నాయకులు సుభాష్ ను ఘనంగా సన్మానించారు. మధర్ థెరిస్సా ఫౌండేషన్ బెంగళూరు చిందం సుభాష్ కు గౌరవ డాక్టరేట్ పట్టాను అందజేసి సన్మానించింది. గతంలో సుభాష్ జహీరాబాద్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తూ, తోటి మిత్రులను మానవ సేవా కార్యక్రమాల వైపు ప్రోత్సహించేవారని, ఆ అభిమానంతో సుభాష్ ను శాలువా పూల మాలలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జహీరాబాద్ ఇంచార్జ్ నౌబాద్ జగన్నాథ్, విహెచ్పి సంతోష్, సీనియర్ నాయకులు భాస్కర్, పూల సంతోష్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పురగిరి క్షత్రియ పేరుక సంఘం అధ్యక్షులు ఎన్నిక



**చందుర్తి మండల్, జూన్ 22 (మన వార్త ప్రతినిధి ముఖేష్):**
చందుర్తి మండలం గ్రామ శాఖ పురగిరి క్షత్రియ పేరుక సంఘం అధ్యక్షులుగా మెంగని రవి ఎన్నికయ్యారు, చందుర్తి మండలం లో సంఘ భవనంలో శనివారం పీక సంఘం ఎన్నికలు నిర్వహించారు, అధ్యక్షులుగా రవి, ఉపాధ్యక్షులుగా మార్త బలరాం ఎన్నికైనట్లు పెరుక సంఘం జిల్లా అధ్యక్షులు మార్తసత్తయ్య తెలిపారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చందుర్తి మండలం లో పెరిక సంఘం అభివృద్ధికి తమవంతుగా కృషి చేస్తామన్నారు, ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు, నూతన కార్యవర్గాన్ని శాలువాతో సన్మానించారు.

# నత్త నడకన ఫ్లైఓవర్ నిర్మాణం



**–రైతులకు ఓ న్యాయం..పెట్రోల్ బంక్ యజమానికి ఓ న్యాయమా?**

**శంకరపట్నం,జూన్ 22(మన వార్త ప్రతినిధి)**
జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలో జరుగుతున్న ఫ్లై ఓవర్ నిర్మాణం నత్త నడకన సాగుతుంది.జాతీయ రహదారి విస్తరణ కోసం రైతుల నుండి భూములు సేకరించిన ప్రభుత్వం పరిహారం కొంతమందికి అందకున్నా. జబర్దస్తీగా పనులు చేపడుతున్నారు.ఇటీవల మొలంగూరు అడ్డరోడ్డు,కొత్తగట్టు గ్రామంలో పరిహారం రాలేదని గృహ యజమానులు,ఆందోళన చేసిన విషయం విధితమే ఫ్లైఓవర్ నిర్మాణంలో కొత్తగట్టు గ్రామ శివారులో ఉన్న పెట్రోల్ బంక్ పోతుండగా.భూ సేకరణలో భాగంగా పరిహారం పొందారు.అయినప్పటికీ కాంట్రాక్టర్ అధికారుల నిర్లక్ష్యంతో పెట్రోల్ పంప్ వరకు ఫై ఓవర్ నిర్మాణం చేపట్టి. అక్కడికే పనులు ఆపివేశారు.పెట్రోల్ బంక్ యజమాని ఇచ్చే మామూళ్లకు లొంగి అధికారులు పనులు చేస్తున్నారని రైతులు ఆరోపించారు.వ్యవసాయ బావులు కోల్పోయిన రైతల నుండి అధికారులు భూసేకరణలో భాగంగా జబర్దస్తీగా వ్యవసాయ బావిని పూడ్చివేసి పనులు చేశారు. కొత్తగట్టు గ్రామ శివారులోని పరిహారం పొందిన బంకు యజమాని మాత్రం పెట్రోల్ డీజిల్ అమ్మకాలు చేస్తూ లాభాలు అర్జిస్తున్నాడు. వెంటనే పెట్రోల్ బంక్ ముందు ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టి పనులు చేపట్టాలని కొత్తగట్టు గ్రామ రైతులు డిమాండ్ చేశారు.

# మహా ఘనంగా గంగమ్మ బోనాలు



**చందుర్తి మండల్, జూన్ 22 (మన వార్త ప్రతినిధి ముఖేష్):** చందుర్తి మండలం మల్యాల గ్రామంలోని శనివారం రోజున సత్యగంగ పౌర్ణమి సందర్భంగా బెస్త కులస్తులు గంగమ్మ జాతర బోనాల కార్యక్రమాన్ని మహా ఘనంగా నిర్వహించారు. డీజే చప్పుళ్లతో, ఇంటింటికి బోనంతో బయలుదేరి గంగమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రతి సంవత్సరం జూన్ మాసంలో వచ్చే సత్యగంగా పౌర్ణమి రోజున ఆ గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించుతామని వారు తెలిపారు, ఇట్టి కార్యక్రమంలో బెస్త కులస్తులు మరియు గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

# పన్నులు వసూళ్ళలో జాప్యం చేస్తే కఠిన చర్యలు...



**-మున్సిపల్ కమీషనర్ మహమ్మద్ అయాజ్...**

**జమ్మికుంట, జూన్ 22( మన వార్త ప్రతినిధి):** ఇంటి,నల్ల పన్ను వసులలో అలస్తవం వహించకూడదని మున్సిపల్ సిబ్బందికి కమిషనర్ ఆదేశాలు జారీచేశారు.జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్ లతో శనివారం మున్సిపల్ కమిషనర్ అయాజ్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో ఇంటి, నల్ల పన్నుల వసూళ్ళలో జాప్యం చేయరాదని, పన్నుల వసూళ్ళలో ఎటువంటి నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి రోజు మూడు లక్షల వసూళ్లు తప్పనిసరిగా వసూళ్లు చేయాలని చెప్పారు.సకాలంలో పన్నులు చెల్లించి ప్రజలు మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కమీషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ భూపాల్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్,ఈఓ, వార్డు ఆఫీసర్లు పలువురు పాల్గొన్నారు.

# మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాలాభిషేకం..



**సైదాపూర్ జూన్ 22(మన వార్త ప్రతినిధి రాజ్ కుమార్ కొరిమి)** సైదాపూర్ మండల కేంద్రం పాత బస్టాండ్ ఆవరణంలో కాంగ్రెస్ పార్టీ మరియు రైతుల ఆధ్వర్యంలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ పై నిన్న రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్న సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మరియు ,రవాణా బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి పాల అభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంత సుధాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతులకు రుణమాఫీ చేస్తాము అని చెప్పిన మాట నిలబెట్టుకుంది కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చి మాట తప్పకుండా ఆగస్టు15 లోపు రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీ చేసే విధంగా విధి విధానాలను రూపొందించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి మంత్రివర్గం బృందానికి కృతజ్ఞతలు తెలుపుతూ సైదాపూర్ కాంగ్రెస్ పార్టీ పక్షాన రైతుల పక్షాన అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్ మరియు జిల్లా అధికార ప్రతినిధి మేకల రవీందర్, కిష్టయ్య, రాఘవులు,రాజిరెడ్డి, మల్లయ్య,విద్వాన్ రెడ్డి, ఎర్రాల శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షులు గొల్లపల్లి యాదగిరి,వెల్ది రాజు, భాష వేణి సంపత్, అశోక్,వెంకటేశం, మునిపాల రవి,కొమురయ్య, ఈశ్వరయ్య, మేకల రాజు, యువజన కాంగ్రెస్ నాయకులు తిరుపతి నాయక్, అనిల్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఏడు మట్టి టిప్పర్లు పట్టివేత



**శంకరపట్నం, జూన్ 22(మన వార్త ప్రతినిధి నేరెళ్ళ సంతోష్)** శంకరపట్నం మండలంలోని కేశవపట్నం జాతీయ రహదారి పనులకు తరలిస్తున్న ఏడు మట్టి టిపర్లను హుజురాబాద్ ఆర్టిఏ వేణు శనివారం పట్టుకున్నారు.అధికలోడుతో పాటు సరైన ధ్రువ పత్రాలు లేని కారణంగా మట్టి టిప్పర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్ కి తరలించారు.మట్టి టీప్పర్లతో పాటు రెండు మట్టి చదును చేసే యంత్రాలను పట్టుకొని సీజ్ చేశారు.

## మంత్రి సహకారం తో మత్స్యకారుల అభివృద్ధి కొరకు కృషి చేస్తా

**-పెసరు కుమారస్వామి ముదిరాజ్**



**సైదాపూర్ జూన్ 22(మన వార్త ప్రతినిధి రాజ్ కుమార్ కొరిమి)** సైదాపూర్ మండలం వెన్నంపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు పెసరు కుమారస్వామి ముదిరాజ్, కరీంనగర్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షులు గా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా వారిని వెన్నంపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘ సభ్యులు శనివారం రోజున సంఘ భవనంలో శాలువా తో సత్కరించి స్వీట్లు పంపిణీ చేశారు,ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నికైన పెసరు కుమారస్వామి ముదిరాజ్ మా సంఘం అధ్యక్షుడు కావడం మాకు సంతోషదాయకంగా గర్వకారణంగా ఉందన్నారు,అనంతరం జిల్లా ఉపాధ్యక్షులు పెసరు కుమారస్వామి ముదిరాజ్ మాట్లాడుతూ వెన్నంపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘ సభ్యులు కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశు, వెన్నంపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అభివృద్ధితోపాటు జిల్లాలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు మత్స్యకారుల సంక్షేమం కొరకు హుస్నాబాద్ శాసనసభ్యులు ,బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో నా వంతు కృషి చేస్తానన్నారు,ఈ కార్యక్రమంలో వెన్నంపల్లి మత్స పారిశ్రామిక సహకార సంఘ ఉపాధ్యక్షులు నెల్లి శ్రీనివాస్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి పెసరు కొమురయ్య ముదిరాజ్, కుల సంఘం అధ్యక్షులు రేగుల సమ్మయ్య ముదిరాజ్ మరియు డైరెక్టర్లు నెల్లి వీరేశం, ముదిరాజ్ సంఘం యూత్ అధ్యక్షులు పెసరు హరీష్ ముదిరాజ్, సంఘ సభ్యులు, పెసరు రాజయ్య ముదిరాజ్, పెసరు అశోక్ ముదిరాజ్, రేగుల సురేష్ ముదిరాజ్, పెసరు రమేష్ ముదిరాజ్,నెల్లి రాకేష్ ముదిరాజ్, రేగుల శ్రీనివాస్ ముదిరాజ్, నెల్లి సాయి కృష్ణ ముదిరాజ్, అడిగే రాజు ముదిరాజ్,తదితరులు పాల్గొన్నారు.

# రైతుల మేలుకోరే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ



**-వేములవాడ కాంగ్రెస్ పార్టీ అర్బన్ మండల అధ్యక్షుడు పిల్లి కనకయ్య**

**వేములవాడ, జూన్ 22 (మన వార్త ప్రతినిధి నందు రావు):** వేములవాడ అర్బన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నంది కమాన్ వద్ద రేవంత్ రెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి, బట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ఆది శ్రీనివాస్ చిత్రపటానికి శనివారం పిల్లి కనకయ్య ఆధ్వర్యంలో పాలభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా హామీ ఇచ్చిన ప్రకారం రైతులకు రెండు లక్షల రుణమాఫీ బిల్లును క్యాబినెట్ మీటింగ్ లో ఆమోదం తెలపడం హర్షణీయం అన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి పొన్నం, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అలాగే ప్రభుత్వ విప్ , స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు రైతుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. డిసెంబర్ 9 2023 వరకు రుణం తీసుకున్న రైతులకు రుణమాఫీ వర్తించనిందని , ఆగస్టు 15 లోపు రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయడం గర్వించదగ్గ విషయం అన్నారు. రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కేవలం కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని అన్నారు. ఇలాంటి నాయకుడు దొరకడం తెలంగాణ ప్రజల అదృష్టం అని అన్నారు. మిగతా గ్యారంటీలను కూడా ప్రభుత్వం అతి త్వరలో అందించనుంది అని తెలియజేశారు. అభివృద్ధి పనులతో ముందుకు వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ నీ ప్రజలంతా బలపరచాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మండల గ్రామ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**గంభీరావుపేట జూన్ 22 మన వార్తా ప్రతినిధి**

గంభీరావుపేట మండల కేంద్రంలో శనివారం రోజున మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ కాంగ్రెస్ నాయకులతో కలిసి తెలంగాణ స్తూపం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తానని మాట ఇచ్చి మాట తప్పకుండా ఒకేసారి రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేస్తుందని తెలిపారు, ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొమ్మిరి శెట్టి తిరుపతి, గ్రామ శాఖ అధ్యక్షులు పాప గారి రాజు గౌడ్, ఓరుగంటి నర్సింలు, మాజీ సర్పంచ్ తిరుపతి గౌడ్, అక్క పెల్లి బాలయ్య, దిశెట్టి రాజశేఖర్ అజ్మీర భాస్కర్, గౌరీ శంకర్, జంగం రాజులు, గుడికాడ బాలయ్య, మల్యాల రాజు వీర్, గుడికాడి కుమార్, కోట భూమయ్య, మేడ భాస్కర్, పంతం సురేష్, గంగి స్వామి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లచ్చయ్య, శ్రీనివాస్, కొక్కురాజం, బాబు తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ పర్యటనలో దొంగల చేతివాటం

**శంకరపట్నం,జూన్ 22(మన వార్త ప్రతినిధి నేరెళ్ల సంతోష్)**

మండలంలోని తాడికల్ గ్రామంలో సహకార సంఘ భవనాన్ని శుక్రవారం కేంద్ర హొంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పర్యటనలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు.తాడికల్ సహకార సంఘం భవనాన్ని కేంద్ర హొం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించిన అనంతరం పలు రాజకీయ పార్టీలనేతలు బొకేలు అందించారు. ప్రారంభోత్సవకార్యక్రమానికి కరీం పేట గ్రామానికి చెందిన ఎగుర్ల సంపత్ హాజరు కాగా జనం రద్దిగా ఉండడంతో ప్యాంటు వెనుక జేబులో నుండి రూ. 10వేల నగదును దొంగలు దొంగిలించారని సంపత్ ఆవేదన వ్యక్తం చేశాడు.దీంతో శనివారం కేశవపట్నం పోలీస్ స్టేషన్లో బాధితుడు ఫిర్యాదు చేశాడు.

# వర్షాలు సమృద్ధిగా కురవాలని కన్నాపూర్ లో కప్పతల్లి ఆట.!



**శంకరపట్నం,జూన్ 22(మన వార్త ప్రతినిధి నేరెళ్ల సంతోష్)** వర్షాకాలం సీజన్ మొదలవడంతో రైతన్నలు పంటలు వేయడానికి అన్ని సిద్ధం చేసుకుంటున్న వేళ, వర్షాల రాక కోసం మండలంలోని కన్నాపూర్ గ్రామంలో గ్రామస్తులు శనివారం రోజున కప్పతల్లి ఆడారు.ఈ సందర్భంగా కప్పతల్లిని ఒక కర్రకు కట్టి దానిని ఇద్దరు మోస్తూ ఉండగా, గ్రామస్తులు బిందెలతో నీటిని కప్పతల్లి పై దానిని మోసే వారిపై పోస్తూ, గ్రామం మొత్తం కలియ తిరిగారు.ఈ క్రమంలో గ్రామస్తులు మొదట గ్రామ దేవతలకు,అదేవిధంగా బీర్న దేవాలయంలోని దేవత మూర్తులకు నీటి బిందెలను తీసుకెళ్లి జలాభిషేకం చేశారు,భజనలు, భక్తి పాటలతో గ్రామ పొలిమేరలోని చెరువు కట్టకు చేరుకొని,మత్తడిపై కొబ్బరికాయలను కొట్టి ఈసారి వర్షాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకున్నారు.కప్పతల్లిని చెరువులో వదిలి పెట్టారు.అనంతరం శ్రీ వాలిసుగ్రీవ దేవాలయంలో వరద పాశం పోసి సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు కుంటలు బావులు నిండు కుండలా మారి పంటలు బాగా పండి, గ్రామస్తులంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో,పాడి పశువులతో చల్లగా ఉండాలని వరుణ దేవుడిని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ కాటం వెంకటరమణారెడ్డి,మాజీ సర్పంచ్ తాటికొండ సదానంద చారి, మాజీ ఉపసర్పంచ్ రెడ్డి మల్లేష్ లతోపాటు కాటం శ్రీనివాస్ రెడ్డి,నాయిని మల్లయ్య, నూనె రవి, నూనె శ్రీనివాస్,పెన్ రెడ్డి సంపత్ రెడ్డి,సత్యనారాయణ,దేవునూరి వెంకటేశ్వర్లు,గొర్ల అనిల్ యాదవ్, రమేష్,చుక్కల శ్రీకాంత్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవంలో కేశవపట్నం శివకేశవ భజన మండలి భక్త బృందం



**శంకరపట్నం,జూన్ 22(మన వార్త ప్రతినిధి నేరెళ్ళ సంతోష్)** అఖిల భారత అయ్యప్ప దీక్షహా సమితి కరీంనగర్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామీ పడి పూజహొమహొత్సవంలో భాగంగా నీగానమే నాప్రాణం 12 గంటల పాటు అఖండ భజన కార్యక్రమంలో శివకేశవ భజన మండలిహొకేశవపట్నంహొ భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో శివకేశవ భజన మండలి అధ్యక్షులు భూపతి నాగభూషణం,బొంగొని శ్రీనివాస్,ఆకుల కుమర స్వామి, బొజ్జ చంద్రమౌళి,బెస్ట్ దోలకిస్ట్ ప్రమోద్,బొంగోని సంపత్,తనుకు శ్రీనివాస్, మదునయ్య,దోమ్మేటి వెంకటేష్,మొలంగురి రాజు, రాసమల్ల శ్రీనివాస్,కలెపెల్లి కోటి, భక్త బృందం పాల్గొన్నారు

## అధిక ధరలకు పుస్తకాలు విక్రయిస్తున్నారని తాసిల్దార్ కు ఫిర్యాదు..



**జమ్మికుంట, జూన్ 22( మన వార్త ప్రతినిధి):** ప్రైవేటు విద్యా సంస్థల యజమాన్యం బుక్ స్టాల్ యజమానులతో కుమ్మక్కై కమిషన్ల కోసం పుస్తకాలు అధిక ధరలకు విక్రయిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు జమ్మికుంట తాసిల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. 2024 25 విద్యాసంస్థలానికి సంబంధించిన పుస్తకాలను ప్రైవేటు విద్యాసంస్థల లలో చదువుతున్న విద్యార్థుల పాఠ్యపుస్తకాలు బుక్ స్టాల్ నిర్వాహకులతోకలసి ప్రైవేట్ విద్యాసంస్థల యజమానులు కమిషన్ల కోసం కక్కుర్తి పడి అధిక ధరలకు విక్రయిస్తున్నారని,వాటికి రశీదు ఇవ్వకుండా తెల్ల కాగితంపై బిల్లు ఇస్తున్నారని ఆరోపించారు. పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్నా పట్టించుకున్న అధికారులు కరువవడంతో విద్యాసంస్థల యజమాన్యం ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందనంగా నడుస్తుందని వాపోయారు. ఒకపక్క అధిక ఫీజులు, మరొక పక్క పుస్తకాల అధిక ధరలతో విద్యార్థుల తల్లిదండ్రులు నానా ఇబ్బందులూ పడుతున్నాని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక ధరలకు పాఠ్య పుస్తకాల అమ్ముతున్న బుక్ స్టాల్ లపై తనిఖీ నిర్వహించి చర్యలు తీసుకోని విద్యార్థుల తల్లిదండ్రులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొమ్ము నరేష్, గోపగాని సుశాంత్,పర్లపెల్లి శ్రీనివాస్,గట్టు శ్రీరామ్ తదితరులు వున్నారు.

# విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు ధ్వంసం....




**జమ్మికుంట, జూన్ 22( మన వార్త ప్రతినిధి):**

విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు ధ్వంసం చేసి కాపర్ వైర్లు ఎత్తుకెళ్లారని విద్యుత్ అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రవి తెలిపారు. సిఐ వివరాల ప్రకారం బాధల రమేష్ జమ్మికుంట రూరల్ TSNPDCL (AE)బాధల రమేష్ తన ఆ దినంలో ఉన్న మడిపల్లి గ్రామ శివారులో రెండు ఎలక్ట్రికల్ ట్రాన్స్ ఫార్మార్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్ వైర్లను దొంగిలించారని, కాపర్ వైర్ విలువ సుమారు 30 వేల రూపాయలు వుంటుందని రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

# కల్కి మూవీకి తెలంగాణ ప్రభుత్వం శుభవార్త....




**మన వార్త** :కల్కి మూవీకి రేవంత్ సర్కార్ అదిరిపోయే శుభవార్త చెప్పింది. కల్కి మూవీ స్పెషల్ షో లకు, టికెట్ల రేట్లు పెంచుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.నాగ్ అశ్విన్ దర్శకత్వంలో పాన్ ఇండియా హీరో ప్రభాస్ నటిస్తోన్న తాజా చిత్రం కల్కి 2898 ఏడీ .ఈ సైన్స్ ఫిక్షన్ అండ్ యాక్షన్ మూవీపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. హాలీవుడ్ రేంజ్ లో తెరెకెక్కుతున్న ఈ సినిమా కోసం ఆడియన్స్ కూడా ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు.తాజాగా 'కల్కి' నుంచి సెకండ్ ట్రైలర్ రిలీజైంది. రిలీజ్ ట్రైలర్ పేరుతో మేకర్స్ విడుదల చేసిన వీడియో ఆకట్టుకుంటోంది. విజువల్స్, బీజీఎం అదిరిపోయాయని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. 'కల్కి' ఈనెల 27న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది. ఇలాంటి తరుణంలోనే.. కల్కి మూవీ స్పెషల్ షో లకు, టికెట్ల రేట్లు పెంచుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.టికెట్ల ధరలు...బెనిఫిట్ షోల రేట్లుసింగిల్ స్క్రీన్ థియేటర్లు 377/-,మల్టీప్లెక్స్ 495/-,రెగ్యులర్ షోల రేట్లు సింగిల్ స్క్రీన్ థియేటర్ 265/-,మల్టీప్లెక్స్ 413/- లుగా ధరలు.ఇప్పటికే రిలీజ్ చేసిన ట్రైలర్తో పాటు కొత్త వీడియో సినిమాపై భారీగా అంచనాలు పెంచేసింది.

## ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్ల నిరంతర తనిఖీ..



**వేములవాడ, జూన్ 22 (మన వార్త ప్రతినిధి నందు రావు):** రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సుమన్ మోహన్ రావు ఆధ్వర్యంలో సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నిరంతర తనిఖీల్లో భాగంగా ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లను డిప్యూటీ డీఎంహెచ్ఓ రజిత తనిఖీ చేశారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు గర్భిణీల పూర్తి వివరాలతో పాటు స్కానింగ్ చేయడానికి గల కారణాలను తప్పక నమోదు చేయాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ బాలయ్య,మహేష్ పాల్గొన్నారు.

## వేములవాడ పట్టణ సీఐ.వీరప్రసాద్ కు పూర్తిస్థాయి బాధ్యతలు..




**వేములవాడ, జూన్ 22 (మన వార్త ప్రతినిధి నందు రావు):** మల్టిజోన్ వన్ పరిధిలో మరో 19 మంది సీఐలకు స్థాన చలనం కల్గింది. ఈ మేరకు ఐజీ కార్యాలయం నుండి శనివారం సాయంత్రం ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే వేములవాడ టౌన్ స్టేషన్లో అటాచ్డ్ డ్యూటీ చేస్తున్న సీఐ బి. వీర ప్రసాద్ వేములవాడ టౌన్ సీఐగా పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

## రెండవ పెళ్లి చేసుకున్న వ్యక్తిపై కేసు నమోదు..



**జమ్మికుంట, జూన్ 22( మన వార్త ప్రతినిధి):** జమ్మికుంట మండలం గోపాలపూర్ గ్రామానికి చెందిన కొండ రవీందర్ అనే వ్యక్తి రెండో పెళ్లి చేసుకోగా అతని భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ తెలిపారు సిఐ వివరాల ప్రకారం ఫిర్యాదురాలు కొండులత రవీందర్ కులం నేతకాని గ్రామం తాళ్లపల్లి మండలం,జిల్లా మంచిర్యాల జిల్లా, నస్పూర్ మండలం, తల్లపల్లి గ్రామానికీ చెందిన కొండు లత జమ్మికుంట మండలం గోవిందాపూర్,గ్రామానికి చెందిన కోండు రవీందర్ తో 2009 లో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. వారికి ఒక పాప ఒక బాబు వున్నారు. 2009 లో వివాహం అయినప్పటి నుంచి 2023 వరకు వారికి ఏలాంటి గొడవలు లేకుండా కలిసిమెలిసి ఉన్నారు. 2023 నుంచి చిన్న చిన్న గొడవలు మొదలయ్యాయి. అప్పటిదాక మేము గోవిందా పూర్ గ్రామం లోనే కలిసి ఉన్నారు. రవీందర్ ఓదెల మండల లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్టు గా ఉద్యోగం చేస్తాడు జనవరి 20న కరీంనగర్ వెళు_న్నానని భార్య లతకు చెప్పకుండా ఇంట్లో వాళ్లకు చెప్పి వెళ్లిపోయినాడు 2024ఫిబ్రవరి 18 న గంగాధర మండలం,అచ్చంపేట గ్రామానికీ చెందిన సంగీతా అనే అమ్మాయిని రవీందర్ ఎల్ ఎం డి కాలనీ లోని లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానంలో పెళ్లి చేసుకున్నాడని,విడాకులు ఇవ్వకుండా రవీందర్ సంగీతలు లు వివాహం చేసుకున్నారని వారిపై చట్ట పరంగా చర్య తీసుకోవాలని ఫిర్యాదు చేయగా లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## స్పందన అనాధ శరణాలయం ఆశ్రమంలో పుస్తకాల పంపిణీ..




**జమ్మికుంట, జూన్ 22( మన వార్త ప్రతినిధి):** స్పందన అనాధ శరణాలయం ఆశ్రమంలో న్యూ విజన్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుక్స్ పంపిణీ చేశారు.అనాథలైన చిన్నారులు చేయి తను అందించాలని ఉద్దేశంతో జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి స్పందన అనాధ శరణాలయంలో న్యూ విజన్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పిల్లలకు పుస్తకాలను, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని పిల్లలకు చేయూతను అందించడం ఆనందంగా ఉందని, ఆశ్రమంలో చదువుకుంటున్న పిల్లలను పెద్ద మనసుతో ఆదరించి మనసున్న పిల్లలుగా గుర్తించాలని వారికి కూడా సమాజంలో సమితిత స్థానం వచ్చేలా ప్రతి ఒక్కరూ చేయితనందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు ప్రసాద్ ,సంపత్ ,జాన్, అశోక్ జాన్ మార్క్ ,జ్యోతి బాబు, సువార్త రాజు తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా టీడబ్ల్యూజేఎఫ్ కరీంనగర్ జిల్లా నగరంలో ప్రెస్‌క్లబ్ ప్రారంభోత్సవం...



-జర్నలిస్టుల హక్కులకూ చట్టం కావాలి

-అధ్యయనం, ప్రజాచైతన్య వార్తలు మరిన్ని రావాలి...



**కరీంనగర్,జూన్ 22( మన వార్త ప్రతినిధి):** జర్నలిస్టులకూ హక్కులు కల్పించేలా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సంక్షేమ పథకాలూ అందేలా చట్టాలు తీసుకురావాలి. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగానే ఉంటూనే ఎన్నో జనం సమస్యల పరిష్కారానికి ప్రజాస్వామ్యంలో ప్రధాన భూమిక పోషిస్తున్న జర్నలిస్టులు తమ హక్కుల కోసమూ సంఘటితంగా ఉండాలి. నిరంతర అధ్యయనం, ప్రజా చైతన్య కథనాలు అందిస్తూ సమాజశ్రేయస్సుల్లో తమకంటూ స్థానం పొందాలి' అని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్‌లో టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌కబ్‌ను శనివారం అట్టహాసంగా ప్రారంభించారు. అంతకు ముందు ముఖ్య అతిథులు, వివిధ రాజకీయపార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర, జాతీయనాయకులు జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా వచ్చిన కరీం'నగర' మేయర్ వై.సునీల్‌రావు మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్‌కు అవసరమైన సౌకర్యాల కల్పనలో తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. తాను విద్యార్థి నాయకునిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించినప్పటి నుంచి మీడియా ప్రాధాన్యత, వారి అవసరం ఎంతగానో ఉందని నమ్ముతానన్నారు.నిజమైన జర్నలిస్టులు, ఫీల్డ్ మీద ఉంటూ నిరంతరం వార్తలు సేకరించే జర్నలిస్టుల్లో కొంతమందికి సంక్షేమాల్లో అన్యాయం జరుగుతోందని, వీటిపైనా పోరాడాలని, అందుకు తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రెస్‌క్లబ్ ప్రారంభోత్సవంతో జర్నలిస్టుల సమస్యల చర్చావేదికలకు, వారి సమావేశాలకు మంచి వేదికగా నిలుస్తుందని అన్నారు. మరో ముఖ్యఅ తిథి సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ 'కట్టుకథలకు, పెట్టుబడులకు పుట్టిన కొన్ని విష పత్రికలు జనం సమస్యలను గాలికొదిలేసి, వారి స్వయప్రయోజనాలే లక్ష్యంగా వార్తలు ప్రచురిస్తున్నాయి' అని అన్నారు. అలాంటి యాజమాన్యాల కింద పని చేసినప్పటికీ ఎంతో మంది జర్నలిస్టులు ప్రజాసమస్యలు వెలికి తీయడంలో వెనుకడుగు వేయడం లేదని, అది అభినందించదగ్గ విషయమన్నారు.టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య ప్రస్తుత పరిస్థితుల్లో జర్నలిస్టులు నిరంతర అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంత్కెనా ఉందనిఅన్నారు. నేతలు చెప్పే ప్రసంగాలు, వారి ప్రకటన ప్రచురణేకాకుండా వాటి వెనుక ఉన్న మర్మం, జనహితమైనవా? కావా? అన్న కోణంలోనూ వార్తాకథనాల రచన మరింతపెరగాలన్నారు. ప్రస్తుతంలో రాష్ట్రంలోని ప్రభుత్వం రాబోయే రోజుల్లో అక్రిడిటేషన్ సంఖ్యను కుదించాలనే ఆలోచన చేస్తోందని, దీన్ని జర్నలిస్టులంతా సంఘటితంగా అడ్డుకుని పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కరీంనగర్‌లో ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు కృషి చేసిన సంఘం సభ్యులను అభినందించారు. అనంతరం ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సోమయ్య మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్‌కు వచ్చే విలేకరులు ఇక్కడికి గోడు వెళ్లబోసుకునేందుకు వచ్చే బాధితులకు అండగా నిలిచి వారి పక్షాన వార్తలు అందించాలన్నారు. ఇతర మీడియా పత్రికలు చదవాలని, ఒక టీవీ సైతం ఏర్పాటు చేసుకుని చానెళ్ల ద్వారా నిరంతర వార్తకథనాలనూ పరిశీలించాలన్నారు. రాబోయే రోజుల్లో జర్నలిస్టుల ఇండ్ల సమస్యలు సహా పలు సంక్షేమాల కోసం ప్రభుత్వానికి ఇప్పటికే విన్నవించామన్నారు. ఈ ప్రెస్‌క్లబ్ ప్రారంభోత్సవంలో టీడబ్ల్యూఎఫ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కొమ్మెర తిరుపతిరెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి సురేందర్‌రెడ్డి, మాజీ జడ్‌పీటీసీ జోగిరెడ్డి, ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండోజు శ్రీకాంత్ సహా జిల్లా ఉపాధ్యక్షులు నల్లగొండ సత్తయ్య,హుజూరాబాద్ డివిజన్ అధ్యక్షులు యోహాన్,జిల్లా కమిటీ సభ్యులు, చట్ల శంకర్, రమేష్,సతీష్,భానుచందర్, రవికృష్ణ, రఫీక్, గణేష్, వెంకటరమణ, రాజు, సంతోష్, ఖాజాఖాన్, శ్రీవాస్, శ్రీరాములు, నవీన్, శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, రామరాజు, ఎల్లస్వామి సహా వివిధ మండలాల నుంచి సుమారు వంద మంది జర్నలిస్టులు పాల్గొన్నారు.


# టీమిండియా సెమీస్ బెర్త్ కన్ఫామ్..



-బంగ్లాదేశ్ ను చిత్తుగా ఓడించిన భారత్...

**మన వార్త** టీమిండియా సెమీస్ బెర్త్ కన్ఫామ్..టీ20 ప్రపంచ కప్ 2024 లో భాగంగా 47వ మ్యాచ్ లో భారత జట్టు బంగ్లాదేశ్ తో తలపడింది. ఈ ప్రపంచ కప్ సూపర్-8 దశలో రెండో విజయాన్ని అందుకుంది. దీంతో టీమిండియా సెమీ ఫైనల్ కు మరింత చేరువైంది.ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన బంగ్లాదేశ్ ముందుగా బౌలింగ్ ఎంచుకోవడంతో టీమిండియా బ్యాటింగ్ కు దిగింది. విరాట్ కోహ్లీ-రోహిత్ శర్మ జోడీ భారత జట్టుకు అద్భుతమైన ఆరంభం అందించింది. ఈ జోడీ నాలుగో ఓవర్ ముగియకముందే తొలి వికెట్ కు 39 పరుగుల భాగస్వామ్యం అందించింది.ఈ క్రమంలోనే రోహిత్ శర్మ బిగ్ షాట్ ఆడబోయి 23 పరుగుల వద్ద ఔట్ అయ్యాడు. 11 బంతులు ఎదుర్కొన్న రోహిత్ శర్మ 23 పరుగుల తన ఇన్నింగ్స్ లో 3 ఫోర్లు, ఒక సిక్సర్ బాదాడు. మరో ఎండ్ లో కోహ్లీ సిక్సర్లతో అదరగొట్టాడు. ఆడిన చిన్న ఇన్నింగ్స్ అయినా అద్భుతమైన మూడు సిక్సర్లు బాదాడు. కోహ్లీ తన 37 పరుగుల ఇన్నింగ్స్ లో 1 ఫోరు, 3 సిక్సర్లు బాదాడు. అలాగే, రిషబ్ పంత్ కూడా 36 పరుగులతో మంచి ఇన్నింగ్స్ ఆడాడు. చివరలో శివమ్ దుబే 34, హార్దిక్ పాండ్యా 50 పరుగుల ఇన్నింగ్స్ తో టీమిండియా 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 196 పరుగులు చేసింది. బంగ్లాదేశ్ బౌలర్లలో తంజిబ్ హాసన్ సాకిబ్, రిషద్ లో చెరో రెండు వికెట్లు తీసుకున్నారు షాకిబ్ అల్ హాసన్ ఒక వికెట్ పడగొట్టాడు.197 పరుగుల భారీ టార్గెట్ తో బ్యాటింగ్ కు దిగిన బంగ్లాదేశ్ జట్టు 8 వికెట్లు కోల్పోయి 20 ఓవర్లలో 146 పరుగులు మాత్రమే చేయగలిగింది. బంగ్లాదేశ్ బ్యాటర్లలో కెప్టెన్ షాంటో 40 పరుగులు, తంజిద్ హాసన్ 29, రిషద్ 24 పరుగులు చేశారు. మిగతా ప్లేయర్లు క్రీజులో ఎక్కువసేపు నిలబడలేక పోయారు. భారత అద్భుతమైన బౌలింగ్ తో పరుగులు చేయడానికి బంగ్లా ప్లేయర్లు ఇబ్బంది పడ్డారు. దీంతో టీమిండియా చేతిలో బంగ్లాదేశ్ 50 పరుగుల తేడాతో ఓడిపోయింది. హాఫ్ సెంచరీ ఇన్నింగ్స్ (50లి పరుగులు) తో పాటు ఒక వికెట్ తీసిన భారత ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచాడు. ఈ గెలుపుతో టీమిండియా సెమీ ఫైనల్ అవకాశాలు మరింత మెరుగుపడ్డాయి. ఒకవేళ ఆఫ్ఘనిస్తాన్ జట్టు ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోతే టీమిండియా నేరుగా సెమీ ఫైనల్ కు చేరుకుంటుంది.

## భారత జట్టుకు దేవుడు ఇచ్చిన బహుమతి....



**మన వార్త** టీ20 ప్రపంచకప్ 2024లో టీమిండియా అద్భుత ప్రదర్శన కనబరుస్తోంది. వరుసగా 4 మ్యాచ్‌ల్లో విజయాా సాధించింది. ఈ నాలుగు మ్యాచ్‌ల్లో బుమ్రా కీలక పాత్ర పోషించాడు. గ్రూప్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండింటిలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో రెండు వికెట్లు తీసిన బుమ్రా.. దాయాదీ పాకిస్థాన్‌తో జరిగిన హైఓల్టేజ్ మ్యాచ్‌లో 3 వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్స్ అందుకున్నాడు. అమెరికా జట్టుపై వికెట్లు తీయనప్పటికీ పొదుపుగా బౌలింగ్ చేశాడు. అఫ్గానిస్థాన్‌తో జరిగిన సూపర్-8 మ్యాచ్‌లో బుమ్రా నిప్పులు చెరిగాడు. 3 వికెట్లు పడొట్టి టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇప్పటి వరకు 4 మ్యాచ్‌లు ఆడిన బుమ్రా మొత్తం 8 వికెట్లు తీసాడు.అఫ్గాన్‌తో మ్యాచ్‌లోనూ సూర్యకుమార్ యాదవ్ హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. టాపార్డర్ విఫలమైన వేళ కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. 'బుమ్రా ఎప్పటిలాగే అద్భుతంగా రాణిస్తున్నాడు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా రాణించే సత్తా అతనికి ఉంది. బుమ్రా వరల్డ్ క్లాస్ పేసర్. భారత జట్టుకు దేవుడు ఇచ్చిన బహుమతి. భారత జట్టులో బుమ్రా ఉండటం భారతీయుల అదృష్టం.సూర్యకుమార్ యాదవ్ కూడా అద్భుతంగా ఆడారు. బ్యాటర్లందరికీ తన బ్యాటింగ్‌తో పాఠాలు చెబుతున్నాడు. ముఖ్యంగా స్లో వికెట్‌పై ఎలా ఆడాలో చూపిస్తున్నాడు.